
# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 23, అక్టోబర్ 2025

## హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా.. ఎస్జీటీ...?

* వార్డెన్‌గా వాచ్‌మెన్..
* నిబంధనలకు విరుద్ధంగా నియామకం చేసిన అధికారులు
* సిర్పూర్ (టీ) ఆశ్రమ పాఠశాల (బాలిక)లో విధులు నిర్వహణ
* గిరిజన విద్యపై నిర్లక్ష్య ధోరణిలో అధికారులు




సిర్పూర్ (టి), అక్టోబర్ 22, ప్రభాతవార్త

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పీజీహెచ్‌ఎం మంజూరు ఉన్నచోట హైస్కూల్‌లో ఒక ఎస్జీటీకి ఇన్చార్జి హెడ్‌మాస్టర్‌గా ఫుల్ అడిషనల్ చార్జ్‌గా బాధ్యతలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బాధ్యతలు ఇచ్చారు. ఇదిలా ఉంటే వార్డెన్ మంజూరు ఉన్న పోస్టులో వాచ్‌మెన్‌ను ఇన్చార్జి డిప్యూటీ వార్డెన్‌గా బాధ్యతలను అప్పజెప్పారు. గిరిజన విద్యార్థుల పట్ల, గిరిజన విద్యా పట్ల అధికారులకు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుంది. నిబంధనలకు విరుద్ధంగా వీరిని నియమించడం ఎంతవరకు సమంజసమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. 2లో..

## పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

● మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త

జిల్లాలో నవంబర్ 1వ తేదీ నుంచి పత్తి కొనుగోలు చేపట్టనున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మంచిర్యాల మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యంలతో కలిసి సిసిఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల నిర్వహకులతో పత్తి కొనుగోలు అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సిసిఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి కనీస మద్దతు ధర చెల్లించి పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు దళారులకు పత్తిని విక్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలలో విక్రయించి కనీస మద్దతు ధరతో లబ్ధి పొందాలని తెలిపారు. 2025-26 సంవత్సరంలో కనీస మద్దతు ధర క్రింద సిసిఐకు పత్తి విక్రయించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని, పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం పత్తిలో తేమ 12 శాతం కంటే తక్కువగా ఉండాలని, నాణ్యతలేని రంగు మారిన వర్షానికి తడిసిన పత్తిని కొనుగోలు చేయడం జరగదని, రైతులు విక్రయించేందుకు విడి పత్తిని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. ఆధార్ ప్రామాణికరణ జరిగిన తరువాతనే పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు తమ ఆధార్ కార్డులో వేలిముద్ర, కంటి స్కాన్, మొబైల్ నెంబర్ అనుసంధానం నవీకరణ చేసుకోవాలని తెలిపారు. ఆధార్‌నంబర్‌కు అనుసంధానం చేయబడిన మిగతా 2లో..

## విద్యారంగ అభివృద్ధి దిశగా చర్యలు

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్చార్జి విద్యాధికారి దీపక్ తివారి



కెరమెరి, ప్రభాతవార్త

విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్చార్జి విద్యాధికారి దీపక్ తివారి తెలిపారు. బుధవారం జిల్లాలోని కెరమరి మండల గోయాగం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇందాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి రిజిస్టర్లు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్చార్జి విద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న మిగతా 2లో..

## గిరిజన హక్కుల కోసం పోరాడిన వీరులను ఆదర్శంగా తీసుకోవాలి

* ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, అక్టోబర్ 22, ప్రభాతవార్త

గిరిజన హక్కుల కోసం పోరాడైన వీరులను ఆదర్శంగా తీసుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆసిఫాబాద్ మండలంలోని రౌట సంకపల్లి గ్రామంలో నిర్వహించిన కుమురం భీం, ఎడ్ల కొండూ 125వ జయంతి ఉత్సవాల్లో బీఆర్ఎస్ నాయకురాలు మర్సకోల సరస్వతితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి జెండా పూజ నిర్వహించి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన తెగల హక్కులు, జల్‌జంగల్‌జమీన్ కోసం పోరాడిన కుమురం భీం, మిగతా 2లో..



## గంజాయి పట్టివేత

✦ మహిళ అరెస్టు

చింతలమానేపల్లి, అక్టోబర్ 22, ప్రభాతవార్త

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్‌ల ఆదేశాల మేరకు గంజాయి అమ్మకాలపై గట్టి నిఘా ఏర్పాటు చేయగా చింతలమానేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 404 గ్రాముల ఎండు గంజాయి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని టెకంగూడ గ్రామానికి చెందిన దుర్గం శాంతబాయి, భర్త లింగయ్య, ఆమె కొడుకు వ్యవసాయం చేస్తుండగా వ్యవసాయంలో లాభం లేదని, అధిక డబ్బులు వస్తాయని ఆశపడి గంజాయి అమ్మేందుకు పథకం వేశారు. ఈ క్రమంలో గత కొన్ని రోజుల కిందట దాదాపు కిలో ఎండు గంజాయి కొనుగోలు మిగతా 2లో..

# హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా ఎస్జీటీ..?

**(మొదటిపేజీ తరువాయి)**

ఈ పాఠశాలలో సుమారు 260 మంది గిరిజన విద్యార్థినులు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్లుగా ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఎస్జిటి ఉపాధ్యాయులు కేవలం ప్రాథమిక స్థాయి విద్యార్థులకే పరిమితం కాని ఏకంగా సెకండరీ పాఠశాలకు ఇన్చార్జి హెడ్మాస్టర్‌గా నియమించడం ఇంతవరకు సమంజసం అని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఇదే విషయంపై జిల్లా గిరిజన అధికారిని ప్రభాతవార్త వివరణ కోరగా ఇది మాకేం కొత్త కాదు చాలా కొన్నిచోట్ల ఎస్జీటీని హై స్కూల్ హెడ్‌మాస్టర్‌గా నియమించిన దాఖలాలు ఉన్నాయని అన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఎవరు ముందుకు రాకపోతే ఎస్జిటికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. త్వరలోనే హెడ్ మాస్టర్‌ను నియమిస్తామని చెప్పుకొచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన హెడ్‌మాస్టర్ డిప్యుటేషన్ పై తిర్యానికి పంపించడం జరిగిందన్నారు. ఇకనైనా రెగ్యులర్ అర్హత కలిగిన హెడ్‌మాస్టర్‌ను నియమించాలని, వార్డెన్‌ను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### పత్తి కొనుగోలు ప్రక్రియ

# సమర్థవంతంగా నిర్వహించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

బ్యాంకు ఖాతాలో మాత్రమే చెల్లింపులు జరుగుతాయని, ఆధార్ కార్డులో ఫోటో కలిగి ఉన్న రైతు మాత్రమే తక్పట్టిలో ఫోటో దిగాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్ డేటా ప్రకారం ధ్రువీకరణ చేయాలని, పత్తిలో తేమ శాతం, కనీస మద్దతు ధర, నిబంధనలు తెలిసేలా గ్రామాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి పత్తి జిల్లాలోకి రాకుండా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా సిసిఐ కేంద్రాలలో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులు కొనుగోలు చేసిన పత్తిని కొనుగోలు కేంద్రాలలోకి అనుమతించకూడదని తెలిపారు. రెవెన్యూ అధికారి, మండల వ్యవసాయ అధికారి, పోలీస్ అధికారులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియపై పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధి దిశగా చర్యలు

**(మొదటిపేజీ తరువాయి)**

అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడంతో పాటు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పలు పాఠ్యాంశాలలో విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మండలంలోని ఝరి గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంఝరి గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులు నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకున్నట్లయితే సకాలంలో విడతలవారీగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా గ్రామంలో నూతనంగా మంజూరు చేయబడిన ఇండ్ల స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని ప్రజలతో సమావేశమై త్రాగునీటి సదుపాయాలు, గ్రామంలో నెలకొన్న సమస్యల వివరాలను తెలుసుకొని త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంజాద్ పాషా ఎంఈఓ ఆడే ప్రకాష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత

**(మొదటిపేజీ తరువాయి)**

చేసి ఇంటికి తీసుకువచ్చి దాచి పెట్టారు. ఇందులో సగం వరకు అమ్మగా మిగిలిన దాన్ని ఇంట్లో దాచి ఉంచారు. ఈ క్రమంలో బుధవారం శాంతబాయి ఇంట్లో ఉన్న ఎండు గంజాయి రణవెల్లి శివారులో ఉన్న తమ చేనులో దాచి పెట్టేందుకు వెళ్తుండగా తమకి అందిన పక్కా సమాచారం మేరకు కౌటాల సీఐ సంతోష్ కుమార్, ఎస్ఐ ఇస్లావత్ నరేశ్‌తో కలిసి ఆకస్మిక దాడి చేసి మార్గ మధ్యలో శాంతబాయిని పట్టుకుని తనిఖీ చేయగా ఆమె వద్ద 404 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. ఆమెను అదుపులోకి తీసుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేయడం జరిగింది. దీని విలువ 8080 రూపాయలు ఉంటుంది. శాంతబాయిని రిమాండ్‌కి తరలించడం జరిగింది. మారకద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి అమ్మకం, సరఫరా పై ఉక్కుపాదం మోపుతున్నామని, ఎవరైనా దీనికి సంబంధించి సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# శిక్షణ అందించేందుకు సంస్థల నుంచి ప్రతిపాదనల స్వీకరణ

### - మంచిర్యాల జిల్లా అల్ప సంఖ్యాక సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి

**నస్పూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**



జిల్లాలోని నిరుద్యోగ మైనారిటీ (ముస్లిం, బౌద్ధ, పార్సి, సిక్కు, జైన) యువకులకు తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆదేశాల మేరకు స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం కొరకు ప్రభుత్వ, ప్రసిద్ధ ప్రైవేట్ సంస్థల నుండి ప్రతిపాదనలు స్వీకరించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా అల్ప సంఖ్యాక సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రొఫెషనల్, ఐటి రంగాలలో నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అనుబంధమైన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ద్వారా ఉచిత శిక్షణ అందించబడుతుందని, ఇందు కొరకు ఆయా సంస్థల నుండి ప్రతిపాదనలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రతిపాదనల ద్వారా విద్యావంతులైన నిరుద్యోగ మైనారిటీ యువతకు ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న రంగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఎంపికైన సంస్థలు శిక్షణ ఇవ్వడమే కాకుండా, శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించవలసి ఉంటుందని తెలిపారు. సంస్థ రిజిస్ట్రేషన్ / ఇన్ కార్పొరేషన్ సర్టిఫికెట్ వివరాలు, చిరునామా, సంప్రదింపు నెంబర్, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అనుబంధ సర్టిఫికెట్ (తప్పనిసరి), గత 3 ఆర్థిక సంవత్సరాల ఆదాయ పన్ను రిటర్న్లు, ఆడిట్ నివేదికలు, గత 3 సంవత్సరాలలో అందించిన నైపుణ్య శిక్షణ ప్రదర్శన, కోర్సు పూర్తి చేసిన సర్టిఫికెట్లు / సంబంధిత ప్రభుత్వ (రాష్ట్ర/ కేంద్ర) సంస్థల ద్వారా జారీ చేయబడిన వర్క్ ఆర్డర్లు, తృతీయ పక్ష అంచనా నివేదిక సంస్థ అందించిన శిక్షణ నాణ్యత పై ధ్రువీకరణ, సంస్థ అందించిన శిక్షణల విజయ గాధలు ఫోటోలు, గత సంవత్సరంలో ఉపాధి కల్పించిన రికార్డులు/ బ్యాంకు స్టేట్మెంట్లు (తప్పనిసరి), జిల్లాలో ఉన్న శిక్షణ కేంద్రాల వివరాలు, పనిచేస్తున్న సిబ్బంది అర్హతల జాబితా వివరాలతో శిక్షణ సంస్థలు తమ ప్రతిపాదనలను జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలోని మొదటి అంతస్తులో గల ఎఫ్-5 లోని జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమ శాఖ కార్యాలయంలో నవంబర్ 6వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు.




# పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

**రామకృష్ణాపూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తవక్కల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థులు పాల్గొని పోలీస్ శాఖ పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా పోలీసు శాఖ కార్యకలాపాలు, ప్రజా సేవా విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్టేషన్‌లోని రిసెప్షన్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, రైటర్, రికార్డ్స్ విభాగం, వైర్‌లెస్ కమ్యూనికేషన్ సెల్ వంటి విభాగాల పనితీరును అధికారులు వివరించారు. పోలీస్ శాఖ, యువత మధ్య అవగాహన పెంచి, పారదర్శకతను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ చొరవ ద్వారా విద్యార్థుల్లో పోలీసు సేవల పట్ల గౌరవభావం, శాంతిభద్రతల ప్రాముఖ్యతపై చైతన్యం పెరిగిందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**



2024-25 సంవత్సరం ఖరీఫ్, రబీలకు సంబంధించి జిల్లాలోని రైస్ మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ డెలివరీ లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరం ఖరీఫ్, రబీ లకు సంబంధించి జిల్లాలోని రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. డెలివరీ లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు, రైస్ మిల్లర్ల నిర్వాహకుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసుకుని 2025-26 సంవత్సరం ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొరకు బ్యాంక్ గ్యారంటీలు, ఒప్పందాలు సమర్పించాలని తెలిపారు. లక్ష్యాలు పూర్తి చేయని డిఫాల్టర్ రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించడం జరగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల కోసం పోరాడిన వీరులను ఆదర్శంగా తీసుకోవాలి

**(మొదటిపేజీ తరువాయి)**

ఎడ్ల కొండు ఆదర్శాలను ప్రస్తుత పాలకులందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన చూపిన మార్గంలో హక్కుల పరిరక్షణ కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కుంరం భీం జన్మించిన ఈ రౌట సంకపల్లి గ్రామానికి మరింత గుర్తింపు తెచ్చేందుకు వారి చరిత్ర భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన శాఖ అధికారి రమాదేవి, ఆదివాసీ నాయకుడు సిడం అర్జు మాస్టర్, మాజీ సర్పంచ్ కిష్టయ్య, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, అరిగేలా నాగేశ్వర్ రావు, బలరాం నాయక్, గుణవంత్ రావు, కుంరం భీము వారసులు కుంరం వెంకటేష్, కుంరం రాము, కుంరం సితారాం, కుంరం అంబారావ్ తదితరులు పాల్గొన్నారు.

# కొమురం భీం ఆశయాలను సాధించాలి

### ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

**బెల్లంపల్లి, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

కొమురం భీం జయంతి సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో కొమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించటం జరిగింది. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ భారత స్వాతంత్ర ఉద్యమంలో గిరిజనుల పోరాటాల స్థానం ఎంతో కీలకమైనదని, ఆదివాసీల ఉత్కంఠ, ప్రగతి కోసం చేసిన పోరాటాలు, కొన్ని శతాబ్దాల కాలం గడిచినా, అధికారిక చరిత్రలో ఎక్కువగా చోటు పొందలేకపోయాయని, తెలంగాణలో కొమరం భీం జీవితం, అతని తత్వం, ఆయన నినాదం, ఈ గిరిజనుల పోరాటానికి శాశ్వత చిహ్నంగా నిలిచిందని, ఆయన మాటల్లో "జల్, జంగిల్, జమీన్" అనే మాటలు గిరిజనుల హక్కుల, స్వాభిమానాన్ని ప్రతిబింబిస్తాయి. 1901లో అక్టోబర్ 22 రోజున ఆదిలాబాద్ జిల్లా (ప్రస్తుత కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా) లోని సంకెపల్లి గ్రామంలో గోండు తెగకు చెందిన తండ్రి కొమరం చిన్నూ, తల్లి సోంబాయి దంపతులకి కొమరం భీం జన్మించాడని, అతని బాల్యం పేదరికం, సామాజిక అన్యాయంతో నిండిందని, తన కుటుంబం, ఇతర గిరిజనులు నిరంతర అణచివేతకు గురవుతుండగా, కొమురం భీం ఈ అసహ్యమైన పరిస్థితుల్ని ఎదుర్కొనసాగాడని, నిజాం పాలనలో అడవి అధికారులు, జమీందార్లు గిరిజనులపై తీవ్ర పీడన కొనసాగించారని, అధికారుల వలన తండ్రి మరణం భీం మనసులో తిరుగుబాటు ఆవేశాన్ని రగిలించి, అక్కడి నుంచే ఆయన ప్రజా పోరాటం ప్రారంభమైందని అన్నారు. అంతే కాకుండా భీం జీవితం ఈ కాలంలో ప్రతి యువతకు మార్గదర్శకం కావాలని, మనం పర్యావరణ మార్పులతో, మౌలిక హక్కుల లేమితో బాధపడుతున్న ఈ కాలంలో కొమరం భీం నినాదం మరింత ప్రసంగికంగా మారిందనీ, ఆయన పోరాటం కేవలం గిరిజనుల హక్కుల కోసం మాత్రమే కాదని, మన అందరి భవిష్యత్తు కోసం. జంగిల్, జమీన్" అనే నినాదం నేటి యువతకు మార్గదర్శకం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చిప్పకుర్తి శ్రీనివాస్ విద్యార్థి జేఏసీ చైర్మన్, చేరాల వంశీ బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, రేగుంట క్రాంతికుమార్ టీవీఎస్ జిల్లా అధ్యక్షుడు, వడ్లకొండ సంజయ్ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు, విద్యార్థులు పాల్గొన్నారు.







# దండారి గుస్సాడి ఉత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఎంపీ

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జాతర్ల గ్రామంలో మంగళవారం ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతర్ల గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన దండారిలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అచల్ మహాజన్, ఎంపి గోడం నగేష్‌లకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు. అనంతరం గిరిజన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత గిరిజనులు సాంప్రదాయ వేషధారణలతో కళాకారులు గుస్సాడి నృత్యాలతో డోలు వాయిద్యాలతో గ్రామం పూర్తిగా పండగ వాతావరణం సంతరించుకుంది. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల సాంస్కృతిక సంపద తెలంగాణకు ప్రత్యేక గుర్తింపుని ఇస్తుందని, గిరిజన కళలు ఉత్సవాలు కొత్త తరానికి స్ఫూర్తినిస్తాయన్నారు. ఎస్పీ మాట్లాడుతూ గిరిజనులు ప్రదర్శించే దండారి గుస్సాడీ నృత్యాలు వారి ఐక్యత, ఆత్మీయతకు ప్రతీకలని పేర్కొన్నారు. ఎంపి మాట్లాడుతు గిరిజనుల సంప్రదాయాలు తెలంగాణ సాంస్కృతికి ఆభరణమని ఈ కళారూపాలను భావితరాలకు తెలియజేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. అనంతరం గ్రామస్తులు భారీ కేక్ కట్ చేసి ఎంపీని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో గ్రామస్తులు కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్లు పరిశీలించిన ఎంపీడీవో

**సారంగాపూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్ పర్యటించి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి నిర్మాణాలు త్వరగా చేపట్టాలని, నాసిరకంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకూడదని తెలిపారు. అనంతరం ఐకెపి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని, ఎవరైనా ఐకెపి సభ్యులు ఇళ్ల నిర్మాణంలో డబ్బులు ఇబ్బందులు అయినప్పుడు ఐకెపి ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణానికి లక్ష రూపాయలని రుణం ఇప్పించడం జరుగుతుందని, ముగ్గురు సభ్యులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు నిర్మాణానికి కోసం ఇవ్వడానికి తీర్మానం చేశారు. ఇందులో గృహ నిర్మాణ ఇంజనీరు, పంచాయతీ సెక్రటరీ సుధాకర్, గ్రామ సిబ్బంది మధు, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ఐకెపి సిబ్బంది, ఇండ్ల నిర్మాణ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు కళాశాలకు తప్పకుండా హాజరు కావాలి

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు బృందం కొల్హారి గ్రామాన్ని బుధవారం సందర్శించారు. విద్యార్థుల యొక్క హాజరు శాతాన్ని పెంచే క్రమంలో కొల్హారి గ్రామంలో ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లి, కళాశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టినటువంటి ఎఫ్‌అర్ఎస్ ద్వారా హాజరు నమోదు కావడం వల్ల విద్యార్థులు గైరహాజరైనట్లయితే వారికి వార్షిక ఫీజు తీసుకోబడదు. కాబట్టి ఈ విషయాలన్నింటిని అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. తల్లిదండ్రులు కూడా తమ యొక్క పిల్లలను కళాశాలకు తప్పకుండా పంపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సుభాష్, జ్ఞానేశ్వర్, భీమేష్, అశోక్ రెడ్డి, హైమద్ పాల్గొన్నారు.

## కపాస్ కిసాన్ యాప్ పై అవగాహన

**లక్షెట్టిపేట, అక్టోబర్ 22 ప్రభాతవార్త**



ప్రత్తి కొనుగోలుకు నూతన విధానంలో భాగంగా కపాస్ కిసాన్ అనే యాప్ వినియోగించు విధానంపై రైతులకు అగ్రికల్చర్ అధికారులు అవగాహన కలిపించారు. బుధవారం మండలంలోని డొడేపల్లి గ్రామ పంచాయతీలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నూతనంగా ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్ పోస్టర్స్‌ను ఏఈఓ సాయిని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్బంగ ఆయన మాట్లాడుతూ... పత్తి రైతులు మీ యొక్క పాత మొబైల్ నెంబర్‌లు పని చేయని ఎడల ప్రస్తుతం ఆధార్‌కు లింక్ ఉన్న కొత్త ఫోన్ నెంబర్‌ను అందరూ మార్చుకోవాలని, కపాస్ కిసాన్ అనే యాప్ ద్వారా రైతులు స్లాట్ బుక్ చేసుకొని సీసీఐ సెంటర్‌లో ప్రత్తి విక్రయించాలని అన్నారు. రైతులు స్మార్ట్ ఫోన్‌లోని ప్లే స్టోర్ నుండి కపాస్ కిసాన్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, మధ్య దళారులకు అమ్మి మోసపోవద్దని అన్నారు. పత్తి విక్రయాలలో యాప్ వినియోగంలో సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కొత్త సుజాత, టెక్నీకల్ అసిస్టెంట్ బి. రాజన్న, రైతులు పాల్గొన్నారు.

## కొమరం భీమ్ ఆశయాలను కొనసాగిద్దాం

**పెంచికల్‌పేట్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చేసిన కొమరం భీమ్ అడుగుజాడల్లో నడుచుకోవాలని పెంచికల్ పేట్ మండల సర్మేడి పోర్తేటి మధుకర్ అన్నారు. బుధవారం కొమరం భీమ్ 125వ జయంతి సందర్భంగా జిల్లేడ గ్రామంలోని కొమరం భీమ్ విగ్రహానికి ఆదివాసీ గిరిజనులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతు ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీక, అస్తిత్వ ఉద్యమల వేగుచుక్క గిరిజన హక్కుల కోసం నైజం సర్కారుతో అలుపెరుగని పోరాటం చేసిన కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో గిరిజన హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోయ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు తలండి మధుకర్, గ్రామా పెద్దలు గురుదాస్, బాపు, లచ్చిరాం, గుండాజి, సాగర్, వెంకటేష్, జలపతి, రాజు, అరుణ్, మహిళలు యువకులు, ప్రజలు పాల్గొన్నారు.



## విద్యార్థినిలకు బహుమతులు అందజేత

**పెంచికల్‌పేట్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

పోలీస్ అమర వీరుల స్మరక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పెంచికల్‌పేట్ ఎస్సై అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినిలకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. అనంతరం అయన మాట్లాడుతు ప్రజల రక్షణ, భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమర వీరులు గౌరవనికి ప్రతీకలు అని విద్యార్థినిలు వారి త్యాగలను తెలుసుకుని సమాజానికి సేవ చేయాలనే స్ఫూర్తి పొందాలని అన్నారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**మామడ, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుధ్య నిర్వహన పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం అయన మామడలో పర్యటించారు. పంచాయతీ రికార్డులు, రోడ్లు, మురికి కాలువలు, షేగ్రీ గెషన్ షెడ్డు తదితర వాటిని పరిశీలించారు. వంద శాతం ఇంటి పన్ను వాసులు చేయాలి అని కార్యదర్శికి సూచించారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

## కోతుల బెడదను నివారించండి

**కెరమెరి, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

మండల కేంద్రంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని నివారించాలని సిఐటియు మండల కన్వీనర్ కూటికేల ఆనందరావు అన్నారు. అటవీ శాఖ ఎఫ్ఆర్ఓ ఎంపీడీవో అంజన్ పాషాకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ప్రతిరోజు ఏదో ఒక వాడలో రోజు కోతులు దాడి చేయడం జరుగుతోంది వందల సంఖ్యలో కోతులు ఉండడంతో ఇంట్లో ఉండేటటువంటి వంట సమగ్రిలని ఇంట్లోకి చొరబడి ధ్వంసం చేస్తున్నాయి. ఇంట్లో ఉన్న మనుషులపై దాడి చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు ఎంపీడీవో చొరవ తీసుకొని కోతుల నుండి విముక్తి చేయాలని లేని పక్షంలో ప్రజలందరినీ కలుపుకొని అటవీ శాఖ రేంజ్, ఎంపీడీవో కార్యాలయాలలో ముట్టడిస్తాం అని డిమాండ్ చేశారు.





## కిసాన్ కాపాస్ యాప్ పై రైతులకు అవగాహన

**ఆసిఫాబాద్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

కిసాన్ కాపాస్ యాప్ పై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడెం గ్రామంలో ఏఈఓ రెహమాన్ మాట్లాడుతూ పత్తిని అమ్ముకునే రైతులు తప్పనిసరిగా కిసాన్ కాపాసియాలో స్లాట్ బుకింగ్ చేసుకున్న తర్వాతనే తమ పత్తిని సంబంధిత సీసీఐ జిన్నింగ్ మిల్లుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ పూర్తి వివరాలు పొందుపరిచి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత ఏఈఓ ను సంప్రదించవచ్చు అని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రభాకర్, వినోద్, అన్నారావు తదితరులు పాల్గొన్నారు.



## పొలంబాట రోడ్లకు శంకుస్థాపన చేసిన సిర్పూర్ ఎమ్మెల్యే

**సిర్పూర్ (టి),అక్టోబర్ 22,ప్రభాతవార్త :**

మండలంలోని పారిగాం గ్రామంలో ఆర్అండ్బి రోడ్డు నుండి గంగ వరకు, లోనవెల్లి గ్రామంలో బారేవాడ నుండి వార్ధా నది వరకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద రెండు రోడ్లు కలిపి రూ.30 లక్షల అంచనాతో మంజూరైన పొలంబాట రోడ్ల నిర్మాణానికి సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమైన జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేలకు, పొలాలకు గ్రావెల్ రోడ్లు వేస్తున్నామని, ప్రతి గ్రామంలో 2 కిలోమీటర్లకు తక్కువ కాకుండా రోడ్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు లావణ్య, మాజీజడ్పీటీసీ సత్యనారాయణ, ఎల్ములే మల్లయ్య, నేరెళ్ళ అశోక్, శ్రీనివాస్ గౌడ్, చాప్లే సుధాకర్, బాలాజీ, అభినయ్ కమలాకర్, రమేష్, సంతోష్, ఉద్ధవ్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అది కర్మయోగి అభియాన్ అవార్డు అందుకున్న గ్రామపంచాయతీ కారో బారికి ఘన సన్మానం

**లింగాపూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

మండలం నుండి అది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో దేశ రాజధాని రాజ్ భవన్ న్యూఢిల్లీలో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకొని, లింగాపూర్‌కు తిరిగి వచ్చిన సందర్భంగా లింగాపూర్ గ్రామ పంచాయతీ కారోబారి జాదవ్ విజేస్‌కు అధికారులు ఘనంగా శాలువాతో సన్మానిచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రామచందర్, మండల పరిషత్ అధికారి రజనీకాంత్, ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి చంద్రాయ, సీనియర్ అసిస్టెంట్ భూపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు మాజీ సర్పంచ్ సుమల ఈశ్వర్, జాదవ్ రమేష్, జూనియర్ అసిస్టెంట్ బాపూరావు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.



# పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధుల కోసం ముఖ్యమంత్రిని కోరినం

### సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

**కాగజ్‌నగర్, అక్టోబర్ 22,ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధుల కోసం ముఖ్యమంత్రిని కోరామని, నిధులు మంజూరు కాగానే పనులు మొదలు పెడతామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి డాక్టర్ హరీష్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దీపావళి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు పట్టణ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాగజ్నగర్ పట్టణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరామని, నిధులు మంజూరు కాగానే పనులు మొదలు పెడతామని అన్నారు.సిర్పూర్ నియోజకవర్గం మీదుగా నాగపూర్ హైదరాబాద్ మధ్య జాతీయ రహదారి నిర్మాణం అలైన్మెంట్ ప్రక్రియ చివరి దశకు వచ్చిందని డిపిఆర్ కోసం ఎన్‌హెచ్ఏఐ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.





## ముగిసిన దండారి వేడుకలు

**సిరికొండ, ప్రభాతవార్త**

దీపావళి పండుగకు వారం రోజుల ముందు ఆదివాసి గ్రామాలలో ప్రారంభమైన దండారి వేడుకలు నేటితో ముగిసాయి. సిరికొండ మండలంలోని ఆదివాసి గ్రామాలలో బుధవారం దండారి ఉత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా ఆదివాసి గ్రామాలలో ఆదివాసీ సంస్కృుృతి, సంప్రదాయ వాయిద్యాలు, చాచోయ్, నృత్యం, కోలాటం, రేల పాటలు ప్రత్యేక గుస్సాడి వేషధారణతో ఆట పాటలతో కొనసాగాయి. ఈ వేడుకలకు ఆదివాసీ సంప్రదాయ పూజలు చేసి ముగింపు పలికారు.



## కొమురం భీం జయంతి వేడుకలు

**జన్నారం, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

మండలంలో కొమురం భీం జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గోండుల గుండె ధైర్యం, ఆదివాసుల ఆరాధ్యదైవం అయిన గోండు ముద్దు బిడ్డ కొమురం భీం జయంతిని పురస్కరించుకుని బుధవారం రోజున కాంగ్రెస్ పార్టీ జన్నారం మండల శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఇంధనపల్లి కొమురం భీం చౌరస్తాలో ఉన్న కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యంలు మాట్లా డుతూ జల్, జంగిల్, జమీన్ అనే నినాదంతో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ధీరుడు ఆదివాసుల ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పిన యోధుడు అని స్వేచ్ఛ సమానత్వం కోసం ప్రాణాలను అర్పించిన మహనీయుడు అని ఆయన చేసిన సేవ లను, త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఇసాక్, మామిడిపల్లి ఇందయ్య, కంటెం శంకర్, అజ్మీరా నందు నాయక్, ముత్యం సతీష్, రియాసత్ అలీ, బాదావత్ సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నులు వంద శాతం వసూల్ చేయాలి

### ఎంపిడీఓ సత్యనారాయణ

**జైపూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో వంద శాతం ఇంటి పన్ను, ఇతర పన్నులను వసూల్ చేయాలని ఎంపిడీఓ జి. సత్యనారాయణ అన్నారు. బుధవారం జైపూర్ గ్రామ పంచాయతీలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని, ఇంటి పన్ను వసూళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశానుసారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తొందరగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. నిర్ణత సమయంలో ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తామని తెలియజేశారు. గ్రామ అభివృద్ధి గ్రామ ప్రజలు చెల్లించే పన్నుల పై ఆధార పడి ఉంటుందని, ఇంటి పన్ను వసూళ్ల 100 శాతం పూర్తి చేయాలని సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శిని అదేశించారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎంపిఓ బాపు రావు, హౌసింగ్ ఏఈ కాంక్ష, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ మల్లేష్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



## మహాధర్నాకు బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలి

### బీసీకేయుపిసి జిల్లా కో కన్వీనర్ కాసెట్టి లక్ష్మన్

**జన్నారం, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

రేపు హైద రాబాదులోని ఇందిరా పార్కు వద్ద జరిగే బీసీల మహాధర్నా కార్యక్రమానికి బీసీలు అధిక సంఖ్యలోతరలిరావాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం (బీసీకేయుపిపిసి) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ కాసెట్టి లక్ష్మన్ కోరారు. బుధవారం రో జున జన్నారం మండలకేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల సా ధనకై బీసీ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్‌తో ఈ నెల 24వ తేదీ శుక్రవారం రోజున హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద (బీసీఐఎఫ్) మేధావుల ఫోరమ్ చైర్మన్ మాజీ ఐఏఎస్ టి. చిరంజీవులు ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నారని ఈ మహాధర్నాకు రాష్టంలోని 33 జిల్లాలకు చెందిన బీసీ కులాల వారు అధిక సంఖ్య లో హాజరుకావాలని కోరారు. అంతేకాకుండా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఈశ్వరయ్య, విశారధన్ మహారాజు లు హాజరుకానున్నారని తెలిపారు.ఈ కార్యక్రమం లో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కో కన్వీనర్‌లు కడార్ల నర్సయ్య, మూల భాస్కర్ గౌడ్, ఆంద్ర పురుషోత్తం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అశోక్, కోడిజుట్టు రాజయ్య, పిల్లి మల్లయ్య, గుడ్ల రాజన్న, కానుగంటి రాజన్న పాల్గొన్నారు.



# నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

**యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో సింగరేణి సంస్థ ముందుంటుంది ✳ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ**

**మందమర్రి, అక్టోబర్ 22, ప్రభాతవార్త**




మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసి క్రీడా మైదానంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్, సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం దేశాల మేరకు ఈనెల 26వ తేదీ రోజున ఉదయం 8.30 గంటలకు బెల్లంపల్లిలోని ఏ.ఎం.సీ క్రీడ మైదానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు సింగరేణి సంస్థ, నోబల్ ఎంపవరమెంట్, వారిచే సంయుక్తంగా మెగా జాబ్ మేళా–2025ను నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. ఈ జాబ్ మేళాకు మందమర్రి, బెల్లంపల్లి, పరిసర ప్రాంతాలలోని సుమారు 7 వేల మంది నిరుద్యోగ యువత రానున్నట్టు వారు సూచనప్రాయంగా తెలియచేశారు. ఈ మెగా జాబ్ మేళాకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు, ఈ జాబ్ మేళాలో దాదాపు 70 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని అన్నారు. దాదాపు 7వేల మంది నిరుద్యోగ యువత ప్రయోజనం పొందే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా మ్యానుఫ్యాక్చరింగ్, రిటైల్, ఐటి, నాన్ ఐటి, డిజిటల్ మార్కెటింగ్, మరియు సర్వీస్ సెంటర్లకు చెందిన ప్రముఖ సంస్థలు నియమాకాలు చేపట్టనున్నట్లు, సాధ్యమైనంతవరకు అదే రోజు నియామక పత్రాలు అందే విధంగా ప్రణాళికలు చేస్తున్నట్లు వారు అన్నారు. సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ముందుంటుందని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఆదేశాలతో స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ సహకారంతో ఈ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా వారి సొంత ప్రాంతంలోనే వివిధ రంగాల ప్రముఖ కంపెనీలో ఉద్యోగాలు పొందేలా ఈ వేదికను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దీని ద్వారా స్థానిక యువత ఉజ్వల భవిష్యత్తుకు పునాది పడుతుందని ఆశిస్తున్నట్లు భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, ఐ.ఈ.డి ఎస్.ఈ కిరణ్ కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, గోగర్ల శోభన్ బాబు నోబెల్ ఎంపవర్మెంట్ స్టేట్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చెయ్యాలి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

ఆదివాసి ముద్దుబిడ్డ, జల్ జంగల్ జమీన్ కోసం పోరాటం చేసి నైజాం సర్కార్ ను మావనాటే మావరాజ్ నినాదంతో గడగడలాడిచ్చిన కుమురం భీం 125వ జయంతిని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రం లోని ప్రజా సంఘాల కార్యాలయంలో కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భీమ్ పేరు చెప్పి రాజకీయాలు చేయడానికి చూస్తున్నాయే తప్ప జిల్లా అభివృద్ధికి, భీం పోరుగ్రామాల అభివృద్ధికి, ఆయన పురిటి గడ్డ రౌట సంకెనపల్లి అభివృద్ధికి కృషి చేయడం లేదని ఆరోపించారు. భీం ఆశయాలు నెరవేర్చాలని, పోరు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని, అదేవిధంగా ఆయన పేరుతో పెట్టినటువంటి ప్రాజెక్టులు రైతులకు ఏవిధంగా ఉపయోగపడడం లేదని, ప్రాజెక్టు కూడా ఎప్పుడు పోతుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు రాజకీయాలు చేయడం మానుకొని జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెడం టికానంద్, గోడిసేల కార్తిక్, సిఐటియు జిల్లా అధ్యక్షులు జె రాజేందర్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నిచల్ తదితరులు పాల్గొన్నారు.




## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

**సారంగాపూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**





మండల కేంద్రంలో నిర్మల్ జిల్లా ఎస్పి జానకీ షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు ఎస్సై శ్రీకాంత్ పోలీస్ స్టేషన్ పని చేయు విధానం, పోలీస్ సిబ్బంది రోజు వారి విధులపై, పోలీస్ స్టేషన్‌లో ఉపయోగించు సాంకేతిక పరికరాల పైన, పోక్సో, మోటర్ వెహికల్ వివిధ చట్టాల పైన అవగాహన కల్పించడం జరిగింది. అంతేకాకుండా మీకు, స్నేహితులకు, ఎవరికైయినా ఇబ్బందులు కల్పిస్తే మీరు నిర్భయంగా, పోలీస్ స్టేషన్‌కు వచ్చి మాకు చెప్పవచ్చు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, ఆకాష్, రవి, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కే. విజయ, ఉపాధ్యాయులు కవిత, గంగుతాయి, రమేష్ చందర్, సునీల్ పాల్గొనడం జరిగింది.

## మూల మలుపులు.. ప్రమాదపు పిలుపులు

**వేమనపల్లి, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

వేమనపల్లి నుండి సుంపుటం వరకు ఉన్న రహదారిపై పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మూలమాలుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చి మొక్కలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.





## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ఆసిఫాబాద్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

ఆసిఫాబాద్ మండలంలోని చిరకుంట గ్రామంలో అరిగెల లక్ష్మయ్య 33వ వర్ధంతి సందర్భంగా బుధవారం వారి కుమారులు అరిగెల నాగేశ్వరావు, మల్లికార్జున్, వేణుల ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా వారి కుమారులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అనుభవజ్ఞులైన వైద్యులచే రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. ఈ వైద్య శిబిరంలో 100కు పైగా రోగులకు వైద్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా భాజపా సీనియర్ నాయకులు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరావు మాట్లాడుతూ తమ తండ్రి లక్ష్మయ్య జ్ఞాపకార్థం ఆయన వర్ధంతి రోజున ప్రతి సంవత్సరం వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు ఉచిత వైద్యంతో పాటు మందులను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు సుంకరి పెంటయ్య, నాయకులు గాజుల రాజేంద్రప్రసాద్, మేకర్తి లచ్చన్న, శరత్, దీపక్ రావ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కొమరం భీమ్ జయంతి

**బెజ్జూర్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

బెజ్జూర్ మండల కేంద్రంలోని ఆదివాసి సంఘ భవనంలో బుధవారం ఆదివాసీ నాయకులు కొమరం భీమ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆదివాసులు అందరికీ కొమరం భీమ్ ఆదర్శమని ప్రతి ఒక్కరూ ఆయన మార్గంలో నడిచి, ఆదివాసుల డిమాండ్లను నెరవేర్చుకోవాలని వారు అన్నారు. ఆదివాసి సమాజానికి ఆయన చేసిన మేలును వారు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆదివాసి నాయకులు మాజీ జెడ్పిటిసి పంద్రం పుష్పలత, సీడం సకారం తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన మొక్కజొన్న పంటను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

**సిరికొండ, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

సిరికొండ మండల కేంద్రానికి చెందిన రైతులు ఇటీవల చేతికొచ్చిన తమ మొక్కజొన్న పంటను బయట ఎండబెట్టుకున్నారు. అయితే మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో మొక్కజొన్న పంట మొత్తం తడిసి ముద్దయిపోయిందని రైతులు వాపోయారు. కాగా బుధవారం తడిసిపోయిన మొక్కజొన్న పంటను అడిషనల్ కలెక్టర్ శ్యామల దేవి పరిశీలించారు. తడిసిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం కొనేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఆమె వెంట తహసిల్దార్ తుకారం, మండల సర్వేయర్ గణేష్ మండల అధికారులు రైతులు ఉన్నారు.



